ఢిల్లీలో డీల్.. ఇక్కడ సేల్

బీజేపీతో రేవంత్‌ది ఫెవికాల్ బంధం • మోదీ, అమిత్‌షాతో మ్యాచ్ ఫిక్సింగ్ • అందుకే తోక కత్తిరించిన రాహుల్

సర్కారుపై పెత్తనం మీనాక్షి చేతికి • సీఎం రేవంత్‌కు రక్షణ కవచంగా కిషన్‌రెడ్డి, బండి సంజయ్

కాంగ్రెస్ ప్రభుత్వంపై నిప్పులు చెరిగిన ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నిజామాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పెద్దలతో డీలింగ్ పెట్టుకుని రాష్ట్రంలో భూములను సేల్ చేస్తున్నారని బీఆర్ఎస్ నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు, ఆర్మూర్ మాజీ ఎమ్మెల్యే ఆశన్నగారి జీవన్‌రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. మోదీ, అమిత్‌షాతో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నందుకే రాహుల్‌గాంధీ రేవంత్ తోక కత్తిరించారని చెప్పారు. సర్కారుపై పెత్తనం చెలాయిస్తున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ సెక్రటేరియెట్‌లో షాడో సీఎంగా సమీక్షలు చేస్తుంటే.. డమ్మీ సీఎంగా మారిన రేవంత్‌రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గోళ్లు గిల్లుకుంటున్నారని ఎద్దేవా చేశారు. నిజామాబాద్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున బీఆర్ఎస్‌లో చేరారు. వారికి నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే బిగాల గణేశ్ గుప్తా, జీవన్‌రెడ్డి కలిసి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడు తూ.. ఏఐసీసీ పెద్దల దృష్టిలో సీఎం రేవంత్ బీజేపీ కోవర్ట్ అని, రాహుల్‌గాంధీ అందుకే రేవంత్ తోక కత్తిరించారని తెలిపారు. రేవంత్‌ను అదుపు చేయడానికి రాహుల్ దూతగా వచ్చిన కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ ఏ హోదాలో సచివాలయంలో అడుగు పెట్టారని నిలదీశారు. గాంధీభవన్‌లో సమీక్షలు పెట్టాల్సిన మీనాక్షి నటరాజన్ సచివాలయంలో సమీక్షలు చేస్తండడం, సచివాలయంలో సమీక్షలు చేయాల్సిన సీఎం రేవంత్‌రెడ్డి కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సమీక్షలు చేయడం వింతగా ఉందన్నారు. హర్యానా, మహారాష్ట్ర, ఢిల్లీలో జరిగిన ఎన్నికల కోసం కాంగ్రెస్‌కు సీఎం రేవంత్‌రెడ్డి డబ్బులు సమకూర్చారని చెప్పారు. ఇక నుంచి డబ్బుల కలెక్షన్ బాధ్యతలు మీనాక్షి నటరాజన్‌కి రాహుల్‌గాంధీ అప్పగించారని తెలిపారు. త్వరలో జరగనున్న బీహార్ ఎన్నికల కోసం డబ్బు పోగేయడానికే మీనాక్షి నటరాజన్ నేరుగా రంగంలోకి దిగి సచివాలయంలోనే సమీక్షలు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. బీజేపీతో రేవంత్‌కు ఫెవికాల్ బంధం ఉందని, ఆయన మోదీ, అమిత్‌షాతో మ్యాచ్ ఫిక్సింగ్ చేసుకున్నారని తెలిపారు. రేవంత్ వచ్చాక హైదరాబాద్‌లో కూల్చివేతలు, పేల్చివేతలు తప్ప ఎలాంటి అభివృద్ధి లేదని విమర్శించారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీ అర్వింద్ త్రయం రేవంత్‌కు రక్షణ కవచంగా నిలుస్తున్నారని చెప్పారు.

గిరిరాజ్ కాలేజీ భూములపై కన్ను...

వచ్చే ఎన్నికల్లో బిగాల గణేశ్ గుప్తా 50వేల మెజార్టీతో గెలవడం ఖాయంగా కనిపిస్తున్నదని జీవన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ఏ గల్లీకి పోయినా కేసీఆర్ కావాలని అంటుండ్రు' అని తెలిపారు. ఆర్మూర్‌లోని కాలేజీ భూముల వివరాలు తెలుసుకున్నారని తెలిపారు. హెచ్‌సీయూ భూములను అమ్మనిస్తే వచ్చే రోజుల్లో మరిన్ని భూములను అమ్మేస్తారని అన్నారు.



బీఆర్ఎస్‌లోకి భారీగా చేరుతున్న వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యేలు జీవన్‌రెడ్డి, బిగాల గణేశ్‌గుప్తా

రవాణాశాఖలో తగ్గిన రాబడి

- గతంతో పోల్చితే రూ.1,203 కోట్లు తగ్గిన వసూళ్లు
- 2024-25లో కేవలం రూ.5,787 కోట్ల ఆదాయం

2014 నుంచి రవాణా శాఖ ఆదాయం

సంవత్సరం	రాబడి (రూ.కోట్లలో)
2014-15	1,854.61
2015-16	2,215.19
2016-17	2,721.26
2017-18	3,228.37
2018-19	3,504.88
2019-20	3,515.82
2020-21	3,228.69
2021-22	3,971.38
2022-23	6,390.80
2023-24	6,990.22
2024-25 (జనవరి)	5,787.96

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): రావాల్సిన డబ్బులను రాబట్టుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా విఫలమవుతున్నదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అన్ని శాఖల్లోనూ ఏటా భారీగా వచ్చే ఆదాయం.. క్రమంగా తగ్గిపోతుండటంపై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఇప్పుడు రెవెన్యూ వసూళ్లు తగ్గిన శాఖల్లో ట్రాన్స్‌పోర్ట్ కూడా చేరింది. రాష్ట్ర రవాణాశాఖలో గతంతో పోల్చితే ఈసారి భారీగా వసూళ్లు తగ్గాయి. కరోనా కాలంలో 2020-21 తర్వాత మళ్లీ భారీగా తగ్గింది. 2023-2024తో రూ. 6,690.22 కోట్ల ఆదాయం రాగా, 2024-25లో కేవలం రూ.5,787.96 కోట్ల ఆదాయం మాత్రమే వచ్చింది. గతంతో పోల్చితే రూ.1,203 కోట్ల రాబడి తగ్గింది. రాష్ట్ర రవాణా శాఖలో వాహనాల రిజిస్ట్రేషన్లు, పర్మిట్లు జారీ చేయడం, పన్ను వసూళ్లు చేయడం, వాహనాలు ఉల్లంఘనలను నియంత్రించడానికి ఫైన్‌లు వేయడం వాటితో ఆదాయం సమకూరుతుంది. తెలంగాణలో 1.72 కోట్ల వాహనాలు రిజిస్టరై ఉండగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రవాణాశాఖ ద్వారా 2025 జనవరి వరకు రూ.5,787.96 కోట్ల మొత్తాన్ని మాత్రమే వసూలు చేశారు.

అన్సారీకి మరో ఉద్యోగం ఇవ్వండి

సజ్జనార్‌కు మంత్రి పొన్నం ఆదేశం

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): మెహదీపట్నం డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న ఏడు అడుగుల అమీన్‌అహ్మద్ అన్సారీకి ఆర్టీసీలోనే మరో ఉద్యోగం ఇవ్వాలని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌ను ఆదేశించారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో 'సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు అన్సారీకి ఆర్టీసీలో మరో ఉద్యోగం ఇవ్వగలరు' అంటూ సజ్జనార్‌కు సూచించారు. ఇటీవల కారుణ్య నియామకం కింద అన్సారీకి కండక్టర్‌గా ఉద్యోగం ఇచ్చారు. అయితే అతని ఎత్తు 7ఫీట్లు కాగా, 6.4 ఫీట్ల ఎత్తున్న బస్సులో డ్యూటీ ఇబ్బందిగా మారింది. దీంతో కొందరు అన్సారీ బాధలు సోషల్ మీడియాలో పోస్టు చేయడంతో అది వైరలైంది. ప్రభుత్వం స్పందించింది.

6 నుంచి ఆర్టీసీ సమ్మె

మొదటిపేజీ తరువాయి...

సమ్మెకు దిగుతున్నట్టు చెప్పారు. వచ్చేనెల 7వ తేదీన తెల్లవారు జాము నుంచే ఎక్కడి బస్సులు అక్కడే డిపోలకే పరిమితమవుతాయని జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, కో-చైర్మన్ కే హన్మంత్ ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం థామస్‌రెడ్డి, కన్వీనర్ ఎండీ మౌలానా, కో-కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేశ్, బీ యాదగిరి తెలిపారు. తమ సమస్యల పరిష్కారానికి ఆర్టీసీ యాజమాన్యం ముందుకు రాకపోవడంపై కార్మికులు లేబర్ కమిషనర్ ఆఫీసు ఎదుట నిరసన తెలిపారు. 'ఆర్టీసీ యాజమాన్యం డౌన్‌డౌన్' అంటూ నినాదాలు చేస్తూ.. చప్పట్లు కొడుతూ హోరెత్తించారు. ఇక ఆర్టీసీ యాజమాన్యం చర్చలకు రాకపోవడం వల్లనే 6వ తేదీ అర్ధరాత్రి నుంచే సమ్మె చేపడుతున్నట్టు తెలుపుతూ జాయింట్ లేబర్ కమిషనర్ సునీతా గోపాల్‌దాస్‌కు లేఖను సమర్పించారు.

లేబర్ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఆర్టీసీ జేఏసీ నేతలు

ఆర్టీసీ విలీన హామీ ఏమైంది?

లేబర్ కమిషనర్ ఆఫీసులో జరిగిన సమావేశాన్ని ఉద్దేశించి జేఏసీ నాయకులు మాట్లాడారు. డిమాండ్లు సాధించేందుకు చేస్తున్న ఈ పోరాటంలో అన్ని కార్మిక సంఘాలు కలిసిరావాలని పిలుపునిచ్చారు. సమ్మె నోటీసులో 21 అంశాలు ప్రస్తావించామని, ఆ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వ, యాజమాన్యాలను ఎన్నో విధాలుగా ఒత్తిడి చేసినా వారినుండి స్పందన రాలేదని అన్నారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినా.. నేటివరకు ఆ సమస్య ఓ కొలిక్కి రాలేదని విమర్శించారు. ట్రేడ్ యూనియన్లను పునరుద్ధరిస్తామని ఎన్నికల సమయంలో హామీనిచ్చినా ఇంతవరకు నెరవేర్చలేదని అన్నారు. ట్రేడ్ యూనియన్ల ప్రాతినిధ్యం లేకపోవడం వల్ల వేధింపులకు గురవుతున్నారని పేర్కొన్నారు.

2017 పీఆర్సీ ఏరియర్స్ ఏవీ?

2017లో వేతన సవరణ జరిగినా ఇంతవరకు బకాయిలు రాకపోవటం విచారకరమని జేఏసీ నేతలు ఆవేదన వ్యక్తంచేశారు. వాటి ఫిక్సేషన్లు జరిపి వెంటనే ఎరియర్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. నేటికీ పాత అలవెన్స్‌లనే అమలు చేస్తూ కార్మికుల శ్రమశక్తిని యాజమాన్యం దోచుకుంటున్నదని విమర్శించారు. 2021 వేతన సవరణ కాలపరిమితి ముగిసినందున వెంటనే వేతన సవరణ జరిపి కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలన్నారు.

ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీకే ఇవ్వాలి..

ఎలక్ట్రిక్ బస్సులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసీకి సరఫరా చేయాలని జేఏసీ నేతలు కోరారు. ఎలక్ట్రిక్ బస్సులను మాన్యుఫాక్చరర్ నుంచి హైర్ బేసిస్‌లో తీసుకోవటం వల్ల సంస్థ ఉనికి ప్రమాదంలో పడుతుందని హెచ్చరించారు. రిక్రూట్‌మెంట్ లేకపోవటం వల్ల ఉద్యోగులపై పనిభారం పెరుగుతున్నదని తెలిపారు. సీసీఎస్, పీఎఫ్‌లకు ఇవ్వాల్సిన నిధులను యాజమాన్యం వెంటనే చెల్లించాలని కోరారు.

కార్మికుల అరెస్టు అన్యాయం..

జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు లేబర్ కమిషనర్ ఆఫీస్‌కు బయల్దేరిన కార్మికులను అరెస్టు చేయడం అన్యాయమని నాయకులు విమర్శించారు. యాజమాన్యాలు కార్మికులను భయభ్రాంతులకు గురి చేయడం తగదన్నారు. ఖమ్మం, సత్తుపల్లి, కొత్తగూడెం, చెంగిచెర్ల, హకీంపేట, కూకట్‌పల్లి, ఇబ్రహీంపట్నం ఇంకా అనేక చోట్ల అక్రమ అరెస్టులు చేయడాన్ని ఖండించారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్ బాబు, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ ఎం వెంకటిగౌడ్, రాష్ట్ర కార్యదర్శి కే భాస్కర్‌రావు, బీ జ్యోతి, ఎంఏ మాజిద్, టీఎంయూ నాయకులు ప్రెసిడెంట్ ఏఆర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కమలాకర్‌గౌడ్, వైస్ ప్రెసిడెంట్‌లు సీహెచ్‌బీ రెడ్డి, జీబీఆర్ రెడ్డి, స్టేట్ సెక్రటరీ శ్రీనివాస్, టీజేఎంయూ అడిషనల్ జనరల్ సెక్రటరీ ప్రేమ్‌నాథ్, ఎన్ఎంయూ నాయకులు గ్రేటర్ హైదరాబాద్ జోనల్ సెక్రటరీ వల్లూరి బాబు, రాష్ట్ర సెక్రటరీ కేఎస్ పాల్ తదితరులు పాల్గొన్నారు.

భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

నయనానందకరం.. శ్రీరామ పట్టాభిషేకం

- కనులారా తిలకించి తరించిన భక్తజనం
- పట్టువస్త్రాలు సమర్పించిన గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

భద్రాచలంలో పట్టాభిషిక్తుడైన శ్రీ సీతారామచంద్రస్వామి

ఖమ్మం, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : భద్రాచలం సీతారామచంద్రస్వామి మహాపట్టాభిషేకం వేడుకను సోమవారం మిథిలాస్టేడియంలో వైభవంగా నిర్వహించారు. రాజలాంఛనాలతో నిర్వహించిన ఈ వేడుకను తిలకించి భక్తజనం పరవశించింది. భద్రాద్రిలో సీతారామచంద్రస్వామి కల్యాణం మరుసటిరోజు మహా పట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నది. ఆదివారం జరిగిన సీతారామకల్యాణ మహోత్సవానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు స్వామివారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించగా సోమవారం జరిగిన మహా పట్టాభిషేకంలో రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ శ్రీరాముడు, సీతమ్మవారికి పట్టువస్త్రాలను సమర్పించారు. గవర్నర్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీధర్, ఈవో రమాదేవి, వేద పండితులు ఘనస్వాగతం పలికారు.

54 సంఘాలతో శాంతి చర్చల కమిటీ

మావోయిస్టులపై యుద్ధాన్ని ఆపాలని కేంద్రానికి సూచన

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): మావోయిస్టులు, ఆదివాసీల సంహారాన్ని ఆపాలని, శాంతి చర్చలు నిర్వహించాలని మావోయిస్టు కేంద్ర కమిటీ కోరడంతో దేశవ్యాప్తంగా ఉన్న 54 సంఘాలతో శాంతి చర్చల కమిటీ ఏర్పడింది. చర్చలకు ఛత్తీస్‌గఢ్ సర్కారు సానుకూలంగా స్పందించడాన్ని కమిటీ సభ్యులు అభినందించారు. కేంద్రం కూడా చర్చలకు ముందడుగు వేయాలని కోరారు. కేంద్రం చొరవ తీసుకుంటే సమస్య తప్పకుండా పరిష్కారమవుతుందని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, నారాయణరావు పేర్కొన్నారు

కల్తీ కల్లు తాగి 50 మందికి అస్వస్థత

బాన్సువాడ, ఏప్రిల్ 7 : కామారెడ్డి జిల్లా నస్రుల్లాబాద్ మండలంలో కల్తీ కల్లు తాగి సోమవారం 50 మంది అస్వస్థతకు గురై, 13 మంది పరిస్థితి విషమంగా ఉన్నది. నస్రుల్లాబాద్ మండలంలోని అంకోల్, అంకోల్ క్యాంపు, దుర్కితోపాటు బీర్కూర్ మండలం దామరంచ గ్రామాల్లో కల్తీ కల్లు కలకలం రేపింది. అస్వస్థతకు గురైన వారిని స్థానికులు హుటాహుటిన బాన్సువాడ దవాఖానకు తరలించారు. విషమంగా ఉన్న వారిని నిజామాబాద్ దవాఖానకు తీసుకెళ్లారు. తొలుత ముగ్గురు, నలుగురు దవాఖానలో చేరగా, ఆ తర్వాత వారి సంఖ్య యాభై దాటిపోయింది. విషయం తెలుసుకున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి కొప్పిశెట్టి బాధితులను పరామర్శించారు.

ఆంధ్రా కంపెనీకి సోలార్ ప్లాంట్లు

- 'పీఎం కుసుమ్' పథకానికి తూట్లు
- రైతులకు అన్యాయం.. ఏపీ కంపెనీ గుత్తాధిపత్యం
- ఆంధ్రా కంపెనీ కోసమే సడలింపులు, పొడిగింపులు
- ఉన్నతాధికారులకు రైతు ఫిర్యాదు చేసినా స్పందన కరువు

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ) : పీఎం కుసుమ్.. ప్రత్యేకించి రైతులు పొలాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకునే స్కీం. ఈ స్కీంలో రైతులను పక్కనపెట్టి ఆంధ్రా కంపెనీకి ప్లాంట్లు కట్టబెట్టేందుకు టీజీ రెడ్‌కో అధికారులు పావులు కదుపుతున్నారు. ఏపీలోని కాకినాడకు చెందిన ప్రైవేట్ కంపెనీకి 2,400 మెగావాట్ల ప్లాంట్లను అప్పగించేందుకు రంగం సిద్ధం చేశారు. ఇది బినామీ కంపెనీ అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ కంపెనీ వెనుక అదానీ సహా మరికొన్ని కంపెనీలున్నట్టు అనుమానాలున్నాయి. కొందరు ప్రభుత్వ పెద్దల హస్తం కూడా ఉన్నట్టు సమాచారం. రైతుల కోసం ఉద్దేశించిన ఈ పథకాన్ని పూర్తిగా ఏపీ కంపెనీకి గంపగుత్తగా అప్పగించడంపై రైతులు అభ్యంతరం చెప్తున్నారు.

ఎకరాకు రూ.15వేలు... ఉద్యోగం..

సదరు ఆంధ్రా కంపెనీ.. రైతులను మభ్యపెట్టి స్థలాలను లీజుకు తీసుకుంటున్నది. ఎకరాకు నెలకు రూ. 15వేలు ఇస్తాం.. కుటుంబంలో ఒకరికి ఉద్యోగమిస్తామంటూ అమాయక రైతులను బుట్టలో వేసుకుంటున్నది. కంపెనీ ప్రయోజనాల కోసం రెడ్‌కో అధికారులు అనేకసార్లు సడలింపులు ఇచ్చారు. అయినా కంపెనీ రూ. 17కోట్ల డిపాజిట్ చెల్లించకపోవడం అనుమానాలకు తావిస్తున్నది. ఇంధనశాఖ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియాకు పలువురు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండాపోయింది.

రైతులకు ఇవ్వకుండా జాప్యం..

పీఎం కుసుమ్ స్కీంలో సోలార్ ప్లాంట్లకు మొత్తంగా 4,364 దరఖాస్తులొచ్చాయి. ప్రైవేట్ కంపెనీల కోసం రెడ్‌కార్పెట్ పరుస్తున్న టీజీ రెడ్‌కో రైతులను మాత్రం ప్రోత్సహించడంలేదు. నల్లగొండ జిల్లా నేరేడుగొమ్మ మండలంలోని కేతేపల్లికి చెందిన రైతు కేతావత్ లష్కర్ అధికారులకు ఫిర్యాదు చేశారు. తాను సొంత స్థలంలో 0.5 మెగావాట్ల ప్లాంట్ ఏర్పాటుకు దరఖాస్తు చేసుకున్నా.. ఇంతవరకు టీజీ రెడ్‌కో అప్రూవల్ ఇవ్వలేదని మొరపెట్టుకున్నాడు. ప్రైవేట్ కంపెనీ రైతుల భూమి లీజుకు తీసుకుంటున్నదని, కంపెనీకి కాకుండా తనకే ప్లాంట్‌ను కేటాయించాలని విజ్ఞప్తి చేశాడు.

ట్రాన్స్‌మిషన్ లైన్లు ప్రభుత్వమే వేయాలి

సోలార్ విద్యుత్తు ప్లాంట్ల ఏర్పాటుపై ఇప్పటికీ చాలా సందేహాలున్నాయి. అనుమానాలను రెడ్‌కో అధికారులు నివృత్తి చేయాలి. కోట్లకు కోట్లు పెట్టి రైతులు ప్లాంట్లు ఏర్పాటు చేసుకోలేరు. బ్యాంకులు రుణాలివ్వడంలేదు. ప్రభుత్వమే గ్యారెంటీ ఇచ్చి, 90శాతం లోన్ ఇప్పించాలి. ప్లాంట్ నుంచి సబ్‌స్టేషన్ వరకు ట్రాన్స్‌మిషన్ లైన్లను ప్రభుత్వమే ఉచితంగా వేయాలి. రైతును ప్రోత్సహించేందుకు సబ్సిడీ మంజూరు చేయాలి.

– బుర్రా అశోక్‌కుమార్, సోలార్ ఎనర్జీ అసోసియేషన్ అధ్యక్షుడు

చర్చలకు రండి!

మొదటిపేజీ తరువాయి...

ఆహ్వానించింది. 12న కేబినెట్ సబ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించనున్నట్టు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఉద్యోగ సంఘాల నేతలకు తెలిపారు. ఉద్యోగులకు సంబంధించిన 57 డిమాండ్లను పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలు కొంత కాలంగా కోరుతున్నారు. అయితే సర్కారు నుంచి స్పందన రాకపోవడంతో మార్చి 12న నిర్వహించిన జేఏసీ సమావేశంలో ఉద్యమ కార్యాచరణను ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జూన్ 9న రాష్ట్రస్థాయిలో మహాధర్నాను నిర్వహించి, ఉద్యోగుల తడాఖా చూపిస్తామని జేఏసీ హెచ్చరించింది. దీంతో ఈ నెల 12న ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలను ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించింది.

చేయిపట్టి లాగిన పోలీసులు

భట్టి చాంబర్ వద్ద జేఏసీ నేతలకు అవమానం

సచివాలయంలో ఉద్యోగ సంఘాల జేఏసీ నేతలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భద్రతాసిబ్బంది అవమానించారు. సోమవారం ఎంప్లాయిస్ జేఏసీ నేతలు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసేందుకు సచివాలయానికి వెళ్లారు. ఈ క్రమంలో ఉద్యోగ సంఘాల జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్‌ను భద్రతాసిబ్బంది ఒకరు చేయిపట్టి లాగారు. దీంతో ఉద్యోగ సంఘాల నేతలు భద్రతాసిబ్బందిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. అక్కడున్నవారంతా నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్‌రెడ్డి, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాస్ రావు, కో చైర్మన్ వంగా రవీందర్‌రెడ్డి, టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి ఎస్ఎం ముజీబ్ హుస్సేని, టీజీవో జనరల్ సెక్రటరీ సత్యనారాయణ, పరమేశ్వర్‌రెడ్డి, కృష్ణాయాదవ్, జ్ఞానేశ్వర్, రామారావు, శ్రీరామ్‌రెడ్డి, రాజ్‌కుమార్, రమణ్‌రెడ్డి తదితులు భట్టి విక్రమార్కను కలిసిన వారిలో ఉన్నారు.

మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్ ఎదుట సోమవారం ఆందోళన చేస్తున్న గిరిజన సంఘాల జేఏసీ నేతలు

ట్రైకార్ రుణాలను వెంటనే విడుదల చేయాలి

- గిరిజన సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ డిమాండ్
- లబ్ధిదారులతో కలిసి గిరిజన సంక్షేమ భవన్ ముట్టడి
- అడుగడుగునా అడ్డుకునేందుకు యత్నించిన పోలీసులు

హైదరాబాద్, ఏప్రిల్7 (నమస్తే తెలంగాణ): గిరిజన యువతకు ఇప్పటికే మంజూరైన ట్రైకార్ రుణాలు రూ.219 కోట్లను వెంటనే విడుదల చేయాలని గిరిజన సంఘాల జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు మాసబ్‌ట్యాంక్‌లోని సంక్షేమ భవన్‌ను సోమవారం ముట్టడించింది. ఈ ముట్టడిని పోలీసులు అడుగడుగునా అడ్డుకునే ప్రయత్నం చేశారు. జిల్లాల్లో ఎక్కడికక్కడ గిరిజన సంఘాల జేఏసీ నేతలను ముందస్తుగా అరెస్టు చేశారు. అయినప్పటికీ పోలీసుల నిర్బంధాన్ని ఛేదించి వందలాది మంది గిరిజన నేతలు, కార్యకర్తలు, లబ్ధిదారులు తరలి వచ్చి సంక్షేమ భవన్‌ను ముట్టడించారు. కార్యాలయంలోకి వెళ్లకుండా బారికేడ్లు అడ్డుగా పెట్టడంతో జేఏసీ నేతలు అక్కడే ధర్నాకు దిగారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ధర్మానాయక్, శ్రీరాంనాయక్, తెలంగాణ గిరిజన సమాఖ్య రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అజ్మీరా రామ్మూర్తి, రమావత్ అంజయ్యనాయక్, లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రాంబాల్‌నాయక్, ఎల్‌హెచ్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు దాస్‌రాంనాయక్, ఎరుకల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీ రఘు, గిరిజన జనసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు వినోద్‌నాయక్ మాట్లాడుతూ.. ట్రైకార్ రుణాలు రూ.219 కోట్లను లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ రాజీవ్ యువవికాసం పథకాన్ని ప్రవేశపెట్టి ట్రైకార్ సంస్థను పూర్తిగా నిర్వీర్యం చేస్తున్నదని మండిపడ్డారు. ట్రైకార్ ద్వారా రూ.50 వేల నుంచి రూ.10 లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు వీలుండగా, ప్రభుత్వం రాజీవ్ యువవికాసం పేరిట రుణాలను గరిష్ఠంగా రూ.4లక్షలకే పరిమితం చేసిందని ధ్వజమెత్తారు. తక్షణమే బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే రాష్ట్రవ్యాప్తంగా పోరాటాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం గిరిజన సంక్షేమశాఖ ఉన్నతాధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. వారి హామీ మేరకు తాత్కాలికంగా ఆందోళనను విరమించారు.

సీఎం సహా మంత్రులంతా గుజరాత్‌లో మకాం

నేడు, రేపు ఏఐసీసీ సమావేశాలు

హైదరాబాద్, ఏప్రిల్ 7(నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డితోపాటు మంత్రులంతా గుజరాత్‌లో మకాం వేయనున్నారు. ఈనెల 8,9 తేదీల్లో రెండ్రోజులపాటు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సీడబ్ల్యూసీ సమావేశాలతోపాటు, ఏఐసీసీ సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో పాల్గొనేందుకు సోమవారం రాత్రి మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి, సీతక్క, పొన్నం ప్రభాకర్ వెళ్లగా, మంగళవారం ఉదయం సీఎం రేవంత్‌రెడ్డితోపాటు ఇతర మంత్రులు వెళ్లనున్నారు. దీంతో రాష్ట్ర క్యాబినెట్ మొత్తం రెండురోజుల పాటు గుజరాత్‌లోనే గడపనున్నది. ఈ నేపథ్యంలో సీఎం, మంత్రుల గుజరాత్ పర్యటనపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బీసీ డిక్లరేషన్ హామీలు అమలు చేస్తున్నం

'చింతన్ శిబిర్'లో పొన్నం, సీతక్క

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): బీసీ డిక్లరేషన్ హామీలన్నింటినీ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్నదని బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క వెల్లడించారు. కేంద్ర సామాజికన్యాయం, సాధికారత శాఖ ఆధ్వర్యంలో ఉత్తరాఖండ్ రాష్ట్రం డెహ్రాడూన్‌లో ఏర్పాటు చేసిన రెండ్రోజుల చింతన్ శిబిర్ కార్యక్రమం కేంద్ర సామాజికన్యాయ మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సందర్భంగా పొన్నం ప్రభాకర్, సీతక్క మాట్లాడు తూ రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కులగణనతోపాటు, బీసీ డిక్లరేషన్ హామీలు అమలు చేస్తున్నామని తెలిపారు.

జీబీ లింక్ డీపీఆర్ ఇవ్వండి..

ప్రాజెక్టు కోసం ఇప్పటికే వెయ్యి కోట్లు ఖర్చు • రోజూ 40 వేల క్యూసెక్కుల తరలింపు పనులు

జీఆర్ఎంబీ భేటీలో తెలంగాణ ఆగ్రహం • వాడీవాడిగా గోదావరి బోర్డు సమావేశం • జీబీ లింక్ ప్రణాళిక దశలోనే ఉందన్న ఏపీ

హైదరాబాద్, ఏప్రిల్ 7 (నమస్తే తెలంగాణ): నిబంధనలకు విరుద్ధంగా ఏపీ ప్రభుత్వం చే